సాక్షి
అనకాపల్లి
బుధవారం, 24, మే, 2023



ఆత్మస్థైర్యం పెంపు

మానసిక దివ్యాంగులకు డీఈవో బోధనోపకరణ సామగ్రిని పంపిణీ చేశారు. 309 మందికి కిట్లు అందిస్తున్నారు. 8లో



నేత్రపర్వం

పేమాంబిక అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. 8లో

స్వల్ప వర్ష సూచన



అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజుల్లో మూడు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని. మిగతా రెండు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సివిల్స్‌లో మెరిసిన తురువోలు బిడ్డ

- 469వ ర్యాంకు సాధించిన హేమంత్
- ఆనందం వ్యక్తం చేసిన గ్రామస్తులు



హేమంత్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామానికి చెందిన హేమంత్ సివిల్స్‌లో 469 ర్యాంకు సాధించడం పట్ల బంధువులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బొడ్డు సత్తిబాబు, బాల దంపతులు ఉద్యోగ రీత్యా విశాఖలో స్థిరపడ్డారు. సత్తిబాబు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కాగా బాల ప్రొఫెసర్. వీరి కుమారుడు హేమంత్ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు శివశివానీ పాఠశాలలోను, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ విజయవాడలోని చైతన్య కళాశాలలో పూర్తి చేశాడు. ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన అనంతరం సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. మంగళవారం వచ్చిన సివిల్స్ ఫలితాల్లో ఆలిండియాలో 469 ర్యాంకు సాధించాడు. తనకు ఐఆర్ఎస్ వస్తుందని, ఐఏఎస్ సాధించేందుకు మరోసారి ప్రయత్నిస్తానని చెప్పాడు. హేమంత్ తమ్ముడు హరి గౌహతి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు.

బాలికల హాస్టల్లోకి డిగ్రీ కాలేజీ తరలింపు



ప్రిన్సిపల్‌కు ఉత్తర్వు కాపీ అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణం చేపట్టిన బాలికల వసతి గృహంలో డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా నిర్వహించడానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శాస్త్రికి మంగళవారం ఉత్తర్వు కాపీ అందజేశారు. దీంతో వచ్చే నెల నుంచి అక్కడే డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహించనున్నారు. ఇంతవరకు జూనియర్ కళాశాలలో షిఫ్ట్ పద్ధతిలో డిగ్రీ కళాశాల నడిచేదని, ఇక నుంచి రెండు పూటలా కళాశాల నిర్వహణ జరుగుతుందని, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ శాస్త్రి తెలిపారు.

మినీ జాబ్ మేళాలో 65మందికి ఉద్యోగాలు



మినీ జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

తుమ్మపాల: రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 65మందికి ఉద్యోగాలు లభించాయి. మొత్తం 185 మంది హాజరయ్యారు. ర్యాండ్‌స్టాడ్, స్పైలెక్స్, హసర్, శ్రీరామ్, సీఈటీసీ కంపెనీల ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి చాముండేశ్వరరావు చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, డిప్లొమా చదువుకున్న నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పలు కంపెనీల అంగీకారంతో కళాశాలలోనే ఇంటర్వ్యూల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కేకే లైన్‌లో జరుగుతున్న ప్రీ నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు, విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26, 29 తేదీల్లోను, కోరాపుట్-విశాఖపట్నం(18511) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 27, 30 తేదీల్లోను, విశాఖపట్నం-కోరాపుట్ (08546) పాసింజర్ స్పెషల్ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు, కోరాపుట్-విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశారు.

చర్చ సుదీర్ఘం.. సమగ్రం!

- పలు అంశాలపై చర్చించిన సభ్యులు
- ప్రశాంతంగా సాగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం
- హాజరైన ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, విప్ ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వేదికపై డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, విశాఖ, అనకాపల్లి జాయింట్ కలెక్టర్లు



హాజరైన సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: చాలా ఏళ్ల తర్వాత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సుదీర్ఘంగా సాగింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా అనేక అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దాదాపు ఏడు గంటల పాటు ఈ సర్వసభ్య సమావేశం కొనసాగింది. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సహా పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యారు. అజెండాలోని అన్ని అంశాలతో పాటు తమ ప్రాంతంలోని సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యమైన వాటిని సమావేశం దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారానికి పాటుపడ్డారు. ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుకను స్థానిక రీచ్‌ల నుంచి ఉచితంగా తరలించుకునేందుకు అనుమతులివ్వాలని, వాటి పరిధులను స్పష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. పరవాడ పారిశ్రామిక ప్రాంతంలో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, సీఎస్సార్ నిధులతో అక్కడ ఒక అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని అనకాపల్లి జేసీ జాహ్నవికి సూచించారు.

విద్యాశాఖకు అభినందనలు

తొలుత పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడు, ఐదు స్థానాల్లో నిలిచిన విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేయడం, నాడు-నేడులో స్కూళ్ల రూపురేఖలు మార్చడం, తగినంత మంది టీచర్లను నియమించడం వంటివి ఉత్తమ ఫలితాలకు కారణమయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషాలిటీ వైద్య సేవలు ఎంతో మెరుగ్గా అందుతున్నాయని, గైనిక్ సేవలు, ప్రసవాలు పెరిగాయని, గర్భ సంచి తొలగింపు శస్త్ర చికిత్సలు కూడా జరుగుతున్నాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ కిషోర్ తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన వారిని అనకాపల్లి తరలించాల్సి వస్తోందని, చోడవరంలోనే పోస్టుమార్టం జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అధికారులకు సూచించారు. కేజీహెచ్‌లో మాదిరిగా అనకాపల్లి జిల్లా ఆస్పత్రుల్లోనూ రెండు పూటలా ఓపీ సేవలు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కోరారు. అనకాపల్లి జిల్లా నుంచి కేజీహెచ్‌కు తరలించే రోగులకు తక్షణ వైద్యం అందేలా, గర్భాశయ శస్త్రచికిత్సలు అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో జరిగేలా చూడాలని కె.కోటపాడు జెడ్పీటీసీ అనురాధ కోరారు. అనకాపల్లి మండలం సంపతిపురంలో జగనన్న కాలనీ లేఅవుట్ వేయలేదని, ఇందులో గృహ నిర్మాణ శాఖ అధికారులపై అవినీతి ఆరోపణలున్నాయని జెడ్పీటీసీ సత్యవతి చెప్పారు. కాలనీ ఇళ్లకిచ్చే ఇసుక కూపన్లలో ఆ శాఖ అధికారులు మోసాలకు పాల్పడుతున్నారని, సిమెంట్, ఐరన్‌ను కూడా అమ్మేసుకున్నారని మునగపాక జెడ్పీటీసీ సోమ సత్యనారాయణ ఆరోపించారు. దీనిపై హౌసింగ్ పీడీ కూర్మినాయుడు స్పందిస్తూ ఈ వ్యవహారంపై విచారణ జరిపిస్తున్నామని, ప్రాథమికంగా రూ.35 లక్షల అవినీతి జరిగినట్టు తేలిందని, త్వరలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. బుచ్చెయ్యపేట మండలంలో అనర్హులకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను అమ్మేసుకున్నారని, వారిపై ఏం చర్యలు తీసుకున్నారని జెడ్పీటీసీ దొండా రాంబాబు ప్రశ్నించారు. చోడవరం-పాడేరు ఘాట్‌రోడ్డు, భీమిలి-నర్సీపట్నం రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆ ప్రాంత జెడ్పీటీసీలు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ఆ పనులు చేపడతామని ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ తెలిపారు. సమావేశంలో విశాఖపట్నం జేసీ కేఎస్ విశ్వనాథన్, అనకాపల్లి జేసీ జాహ్నవి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌కు అభినందనల వెల్లువ..

సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ అధికారులకు అభినందనలు వెల్లువెత్తాయి. సమస్యలు, ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటున్నారని పలువురు సభ్యులు కొనియాడారు.

కలెక్టర్ల గైర్హాజరుపై అసహనం

మంగళవారం నాటి సర్వసభ్య సమావేశానికి విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు, పాడేరు ఐటీడీఏ పీవో హాజరు కాలేదు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలివ్వాల్సిన, గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవలసిన కలెక్టర్లే హాజరు కాకపోవడం సరికాదని జెడ్పీ చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి వీరు హాజరు కానిపక్షంలో తనతో పాటు జెడ్పీటీసీలంతా బహిష్కరిస్తామని ప్రకటించారు. జెడ్పీ సమావేశం సమాచారాన్ని ముందుగా మీడియాకు తెలియజేయకపోవడంపై జిల్లా పౌర సంబంధాల అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీఈవోను ఆదేశించారు. జూన్‌లో మూడు విడతల్లో జెడ్పీటీసీలకు బాపట్ల, సామర్లకోటల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చైర్‌పర్సన్ సుభద్ర తెలిపారు. ఈ తరగతులకు జెడ్పీటీసీలు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

రైతులకు అండగా.. లాభాలు దండిగా..

- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు
- రేపు శంకుస్థాపన చేయనున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి
- హాజరుకానున్న వ్యవసాయ వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి
- రూ.3.5 కోట్లతో చెరకు, చిరుధాన్యాలు, పనసలకు వేర్వేరు కేంద్రాలు
- వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు సదవకాశం



ఆర్ఏఆర్ఎస్ చెరకు పరిశోధన స్థానం

సాక్షి, అనకాపల్లి: వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు మంచి రోజులు రానున్నాయి. పీఎంఎఫ్ఎంఈ (ప్రైమ్ మినిస్టర్స్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్)లో భాగంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో సాధారణ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 25న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎన్జీ రంగా అగ్రి యూనివర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాటి ఆధారిత ఉత్పత్తులు కూడా ఈ సెంటర్ ద్వారా ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి కానున్నాయి.

చెరకు, చిరుధాన్యాలు, పనసల ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన బెల్లం తయారీతో పాటు.. బెల్లం ఆధారిత ఉత్పత్తులు ఇక్కడ నుంచే దేశం నలుమూలలకు ఎగుమతి అవుతాయి. దీంతో చెరకుపై ఆధారపడి జీవించే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. మూడు విధాలుగా ఏర్పాటు చేస్తున్న ఇంక్యుబేషన్ సెంటర్‌కు రూ.3.5 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.1.37 కోట్లతో చెరకు ప్రాసెసింగ్ లైన్లు, రూ.66 లక్షలతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ లైన్లు, రూ.21 లక్షలతో పనస ప్రాసెసింగ్ లైన్లు, రూ.25 లక్షలతో ఆహార ప్రయోగశాల ఏర్పాటు కానున్నాయి. ఇంక్యుబేషన్ భవనం నిర్మాణానికి రూ.కోటి వెచ్చించనున్నారు.

తయారయ్యే ఉత్పత్తులు ఇవే...

- **చెరకు ప్రాసెసింగ్ లైన్లు:** ఘన బెల్లం, పొడి బెల్లం, బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తులు, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం ఓట్సు బిస్కెట్లు, బెల్లం జెల్లీలు, బెల్లం చాక్లెట్లు, బెల్లం పల్లీ చెక్కీలు
- **చిరుధాన్యాల ప్రాసెసింగ్ లైన్లు:** చిరుధాన్యాల పిండి, చిరుధాన్యాల మాల్టు, చిరుధాన్యాల పోషక బార్, మల్టీ మిల్లెట్ దోశ మిక్స్, మల్టీ మిల్లెట్ రొట్టె, చిరుధాన్యాల అటుకులు
- **పనస ప్రాసెసింగ్ లైన్లు:** పనస జామ్, పనస విత్తన పిండి, ఉడికించడానికి సిద్ధంగా ఉన్న లేత పనస

రైతులకు మంచి రోజులు



ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటుతో చెరకు, చిరుధాన్యాలు, పనస పండించే రైతులకు అండగా నిలవడంతో పాటు.... అధిక లాభాలు చేకూరుతాయి. ప్రధానంగా చెరకు ఆధారిత రైతులందరికీ ఇదో మంచి శుభ వార్తగానే చెప్పుకోవచ్చు. వీరితోపాటు పనస, మిల్లెట్స్ పండించే గిరిజన రైతులు కూడా అధిక లాభాలు ఆర్జించవచ్చు.

– పి.వి.కె.జగన్నాథరావు, ఆర్ఏఆర్ఎస్ ఏడీ

ప్రగతి పరుగులు పెట్టాలి

- సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలి
- నాతవరం పర్యటనలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

నాతవరం: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వల్సంపేట, నాతవరం పంచాయతీల్లో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ప్రగతి పనులు త్వరితగతిన పూర్తి కావాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ముందుగా జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. వల్సంపేట లేఅవుట్‌లో నిర్మాణంలో జాప్యంపై అధికారులను అడిగారు. మండలవ్యాప్తంగా నిర్మాణాల పరిస్థితిపై ఆరా తీశారు. నీటి కొరత కారణంగా లేఅవుట్లకు రోడ్డు నిర్మాణంలో జాప్యం జరుగుతోందని అధికారులు వివరించారు. వల్సంపేటలో నిర్మాణంలో ఉన్న సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. రామాలయం వద్ద డ్వాక్రా మహిళలతో కొంతసేపు ముచ్చటించారు. వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల సొమ్మును ఎలా వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. కేంద్రంలో అందించే సేవల గురించి గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వల్సంపేట పాఠశాలలో ఆశించిన విధంగా నాడు నేడు పనులు జరగలేదని, పాఠశాల పునః ప్రారంభంనాటికి మార్పు రావాలన్నారు. వల్సంపేట పంచాయతీలో పలు సమస్యలను సర్పంచ్ ఇట్టంశెట్టి శ్యామల, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నాతవరం పీహెచ్‌సీని సందర్శించి ప్రజలకు అందించే వైద్య సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు. సిబ్బంది పనితీరు మెరుగుపడాలన్నారు. రూ.కోటి 65 లక్షలతో నిర్మించిన అదనపు భవన నిర్మాణ పనులు పరిశీలించి త్వరలో ప్రారంభోత్సవానికి చర్యలు చేపడతామన్నారు. హైస్కూల్‌కు కొత్తగా వచ్చిన విద్యా కానుక కిట్లను పరిశీలించి పంపిణీలో తగు జాగ్రత్తలు చేపట్టాలని ఎంఈవో తాడి అమృత్‌కుమార్‌ను ఆదేశించారు. మండలంలో జగనన్న భూరీసర్వేపై తహసీల్దార్ కనకారావును అడిగారు. కలెక్టర్ పర్యటనలో ఆర్డీవో హెచ్.వి.జయరాం, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వీరాజ్యోతి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ కనకరావు, హౌసింగ్ డీఈ శ్రీఫణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి, వైద్యాధికారి రాజేష్‌నాయుడు, ఏపీఎం లక్ష్మి, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

బదిలీల కోలాహలం

- నేటి నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలు
- ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికనే బదిలీలు
- 5 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీ అవకాశం
- బడి తెరిచే రోజుకు ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు



విశాఖలోని డీఈవో కార్యాలయం

విశాఖ విద్య : జిల్లా విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. బదిలీ కోరుకునే వారు, తప్పనిసరి బదిలీల జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం, ఈసారికి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలకు అవకాశం కల్పించటంతో సొంత గ్రామాలు, వాటి సమీప పాఠశాలలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఉవ్విళ్లూరుతున్నారు. బడులు తెరిచే నాటికి బదిలీల ప్రక్రియ ముగించేలా విద్యాశాఖాధికారులు షెడ్యూల్ ప్రకటించటంతో విద్యా సంవత్సరానికి ఎటువంటి ఆటంకం ఉండదని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయనేది అప్పుడే ఆరా తీస్తున్నారు. తమకు వచ్చే పాయింట్ల ఆధారంగా ఏ స్కూల్లో చోటు దక్కుతుందోననే లెక్కలు వేసుకుంటున్నారు. ఏ ఇద్దరు ఉపాధ్యాయులు కలిసినా, ఇదే విషయమై చర్చించుకుంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేడర్లు కలిపి సుమారు 5 వేల మందికి స్థాన చలనం కలిగే అవకాశం ఉందని అంచనా.

పారదర్శకంగా బదిలీలు

టీడీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల బదిలీలు అంటే అదో పెద్ద ప్రహసనంగా సాగేది. నాయకులు, ప్రజా ప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బదిలీల్లో పారదర్శకతకు పెద్దపీట వేసింది.

పైరవీలకు ఆస్కారం లేకుండా అంతా ఆన్‌లైన్ విధానంలోనే బదిలీలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ఇంట్లో నుంచే ఆన్‌లైన్ ద్వారా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక ఇంట్లో ఉండే బదిలీ ఉత్తర్వులు అందుకునే అవకాశాన్ని కల్పించారు.

ఖాళీల సేకరణకు కసరత్తు

బదిలీల ప్రక్రియ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్నందున, విశాఖపట్నం డీఈవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. కేడర్ల వారీగా ఖాళీలను సేకరిస్తున్నారు. దీనిపై ఉప విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయల నుంచి జాబితాలను తీసుకుంటున్నారు. బదిలీ దరఖాస్తు సమయంలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా, జిల్లా మెడికల్ బోర్డుచే ధ్రువీకరించిన లేటెస్ట్ సర్టిఫికెట్‌ను జత చేయాలని ముందుగానే వివరిస్తున్నారు. అదే విధంగా స్పౌజ్ విషయంలో పూర్తి స్థాయి పరిశీలన చేయనున్నారు.

షెడ్యూల్ ఇలా..

- 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- 25 నుంచి 27 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- 28 నుంచి 29 వరకు ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాల ప్రదర్శన
- 30న సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ
- 31, జూన్ 1న అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం
- జూన్ 2, 3 తేదీల్లో తుది సీనియార్టీ జాబితా వెల్లడి
- 4న కేడర్ల వారీగా ఖాళీల ప్రదర్శన
- 5, 6 తేదీల్లో హెచ్ఎంలు, 5 నుంచి 7 వరకు స్కూల్ అసిస్టెంట్లు, 5 నుంచి 8 వరకు సెకండరీ గ్రేడ్ టీచర్లు వెబ్ ఆప్షన్లకు గడువు
- 9న హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, 9 నుంచి 11 వరకు ఎస్జీటీల బదిలీ ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు.

క్లీన్ అనకాపల్లి

- పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి
- రోడ్లు, కాలువలపై ఆక్రమణలు తొలగించాలి
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత, కమిషనర్ సాయికాంత్‌వర్మ



మెయిన్‌రోడ్డులో కాలువల వద్ద చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

అనకాపల్లి టౌన్: పట్టణ పరిధిలో ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ చెప్పారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 81, 82 వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లిలో ప్రధాన రహదారిని ఆనుకుని అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీలు, తోపుడుబళ్లను తొలగించాలన్నారు. ప్రధాన కాలువలు, మెయిన్‌రోడ్డు బ్రిడ్జిలపై బడ్డీలను తొలగించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా, మధ్యభాగంలో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించడంలేదని, ఎక్కువగా చెత్త కనిపిస్తుందని, ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి పారిశుధ్య కార్మికులతో తక్షణమే శుభ్రం చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రధాన కేంద్రంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తూ, పట్టణ పరిశుభ్రతలో వారిని కూడా భాగస్వాములను చేయాలన్నారు. కాలువలపై ఉన్న ఆక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను వార్డు కార్పొరేటర్ మందపాటి సునీతతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పి.వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడులకు పాల్పడే వారికి గుణపాఠం

- పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష
- డీఎస్పీ, పీపీలను సన్మానించిన ఎస్పీ



దిశ డీఎస్పీ మహేశ్వరరావుకు ప్రశంసాపత్రం



పీపీ కృష్ణకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

అనకాపల్లి టౌన్: లైంగిక దాడులకు పాల్పడే వారికి గుణపాఠం చెప్పాలని, పోక్సో కేసులో నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పడం ఆనందంగా ఉందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. చోడవరం మండలంలో చిన్నారిపై అత్యాచారం జరిపిన వ్యక్తికి జిల్లా కోర్టు కఠిన కారాగార శిక్ష విధించిన నేపథ్యంలో ఎస్పీ మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసిన స్థానిక దిశ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, అతని బృందంతోపాటు న్యాయస్థానంలో వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.కృష్ణలకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

బాధిత తల్లిదండ్రుల ధైర్యం గొప్పది

బాధిత బాలిక తల్లిదండ్రులు, ఇతర సాక్ష్యులు ధైర్యంగా ముందుకొచ్చి కోర్టు మెట్లు ఎక్కడం అభినందనీయమని ఎస్పీ చెప్పారు. ఇలాంటి తప్పులు చేసిన వారికి తప్పకుండా శిక్ష పడాలన్నారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాల వల్లనే నిందితునికి కఠిన శిక్ష పడిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.కృష్ణ చెప్పారు.

దిశ చట్టంపై మరింత గౌరవం

దిశ చట్టంపై గౌరవం పెరిగిందని బాధిత తల్లి అన్నారు. మహిళలపై పెరిగిపోతున్న లైంగిక దాడులను గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని అమలు చేసి మహిళలకు శ్రీరామరక్షగా నిలిచారని తెలిపారు. తన కుమార్తెకు జరిగిన అవమానానికి దిశ చట్టం గట్టి గుణపాఠం చెప్పిందన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి


మృతి చెందిన బాబ్జి

ఎస్.రాయవరం: మండలంలోని గెడ్డపాలెం గ్రామానికి చెందిన పినపాత్రుని బాబ్జి (50) పాముకాటుకు గురై మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీన పొలం పనులకు వెళ్లగా, అతడిని పాము కాటు వేసిందన్నారు. వెంటనే నక్కపల్లి, తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రిలో చేర్పించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది మేజర్ పంచాయతీలో పెద్దేరు నదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మంగళవారం వడ్డాది రాళ్ల కట్టు వద్దకు బహిర్భూమికి వెళ్లిన వారు నీటిలో తేలిన మృతదేహం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కుమారస్వామి తమ సిబ్బందితో వచ్చి దాన్ని బయటకు తీశారు. 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుందని గుర్తించారు. ఐదడుగుల పొడవు కలిగి క్రీం కలర్ ఫుల్ హ్యాండ్స్ టీషర్టు, నీలం రంగు గళ్ల లుంగీ మృతుడి శరీరంపై ఉన్నాయి. నీటిలో మృతదేహం రెండు, మూడు రోజులుగా ఉండిపోవడంతో తీవ్ర దుర్వాసన వెలువడుతోంది. మృతదేహాన్ని బంధువులు గుర్తించేందుకు వీలుగా అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు బంధువులుగానీ, కుటుంబ సభ్యులుగానీ సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌కు గురై యువకుడి మృతి

మునగపాక: మండలంలోని గణపర్తిలో విద్యుత్ షాక్‌కు గురై కర్రి గాంధీ(24) మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లేశ్వరరావు ఇటీవల నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దీనిలో భాగంగా మంగళవారం అతడి కుమారుడు గాంధీ ఇంటి పనుల్లో నిమగ్నమై సెల్‌ఫోన్లో మాట్లాడుతూ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకుంటున్న కొడుకు మృతి చెందడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి
- క్రైం రివ్యూలో ఎస్పీ మురళీకృష్ణ


మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసులు పరిష్కరించి ఇరు వర్గాల కక్షిదారులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నెలవారీ క్రైం సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 934 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.18,69,200 ఉంటుందన్నారు. ఈ కేసుల్లో 19 మందిని అదుపులోకి తీసుకుని, ఆరు వాహనాలతోపాటు 34 సెల్‌ఫోన్లు, రూ.12,700 సీజ్ చేశామన్నారు. గంజాయి నిర్మూలనకు జిల్లాలో వి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో తాటపర్తి, చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో కోనాం, నర్సీపట్నం రూరల్ పరిధిలో డౌనూరు, కేడీ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో భీమవరం గ్రామాల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పలు కళాశాలల్లో 136 కమిటీల ద్వారా యాంటీడ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో 31 కేసులు నమోదు చేసి, 20 మందిని అరెస్టు చేశామన్నారు. 33 పేకాట స్థావరాలపై దాడులు చేపట్టి, 164 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,11,520 స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచామని వివరించారు. 18,680 వాహనాలపై ఎంవీ చలానాల ద్వారా రూ.46,82,585 ప్రభుత్వానికి చెల్లించినట్లు తెలిపారు. వివిధ కళాశాలలతోపాటు బహిరంగ ప్రాంతాల్లో దిశ యాప్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, డీఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాళ్ల పారాణి ఆరకుండానే...

- రాజమండ్రి వద్ద రోడ్డు ప్రమాదం
- నవ వరుడు మృతి
- భార్య, కుటుంబీకులు కన్నీరుమున్నీరు


గణేష్(ఫైల్)


ఇంటి ముందు వేసిన పెళ్లిపందిరి

రావికమతం: ఇటీవలే వివాహమైంది. ఇంకా కాళ్ల పారాణి ఆరలేదు. ఇంటి ముందు పచ్చని పందిరి అలాగే ఉంది. ఇంతలోనే ఆ నవ వరుడు రాజమండ్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందడం ఆ గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. ఇంతలోనే ఎంత కష్టమొచ్చిందంటూ నవ వధువును పట్టుకుని బంధువులు విలపించడం చూపరులను కన్నీరు పెట్టించింది. వివరాలివి. టి.అర్జాపురం గ్రామానికి చెందిన పడాల గణేష్ (23)కు కొయ్యూరు మండలం జమాదులపాలేనికి చెందిన నాగమణితో మూడు నెలల క్రితం వివాహమైంది. ఆ పెళ్లికి వేసిన పచ్చని పందిరి ఇంకా అలాగే ఉంది. కాళ్ల పారాణి ఇంకా ఆరలేదు. ఆడపిల్ల ఇంటివారు, మగ పిల్లాడి బంధువులు అంతా ఆనందంగా ఉన్నారు. అయితే ఇంతలోనే విధి వక్రించింది. గణేష్ చుట్టపు చూపు నిమిత్తం రాజమండ్రి సమీపంలోని మడికిలో ఉన్న అతని చిన్నత్తగారి ఇంటికి నాలుగు రోజుల క్రితం వెళ్లాడు. ఈ నెల 21న అక్కడ జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో గణేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతనిని అక్కడే ఆస్పత్రిలో చేర్చారు. కాగా చికిత్స పొందుతూ గణేష్ మంగళవారం మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం అంతా తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. కుటుంబీకులు, బంధువులు అంతా రాజమండ్రి తరలి వెళ్లి అక్కడే గణేష్ అంత్యక్రియలు నిర్వహించి, మంగళవారం రాత్రి గ్రామానికి తిరిగివచ్చారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కేజీహెచ్‌కు మరో పది మహా ప్రస్థానం వాహనాలు



మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రికి మరో పది మహా ప్రస్థానం వాహనాలు సమకూరనున్నాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన వారిని సొంత గ్రామాలకు తరలించడానికి మహాప్రస్థానం వాహనాలను ఉపయోగిస్తున్నారు. కేజీహెచ్‌లో ప్రస్తుతం ఏడు వాహనాలు మాత్రమే ఉన్నాయి. ఇవి సరిపోకపోవడం లేదని భావించిన కలెక్టర్ ఎ.మల్లికార్జున మరో పది వాహనాల కోసం ప్రయత్నించారు. హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధుల ద్వారా వీటిని సమకూర్చేందుకు ముందుకొచ్చింది. దీంతో కొనుగోలుకు టెండర్లు పిలిచారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారిని మహాప్రస్థానం వాహనాల ద్వారా తరలిస్తుంటారు. రోజుకు సరాసరి పది నుంచి 15 మృతదేహాలను వివిధ ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. జనవరిలో 380, ఫిబ్రవరిలో 400, మార్చిలో 410, ఏప్రిల్‌లో 428 మృతదేహాలను కేజీహెచ్ మహాప్రస్థానం వాహనాల ద్వారా తరలించారు.

దాకమర్రిలో షూటింగ్ సందడి

కొమ్మాది: తగరపువలస దాకమర్రిలోని ఓ కళాశాలలో మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నటుడు సంపూర్ణేష్‌బాబు, హీరోయిన్ మంత్ర, ప్రతికథానాయకుడు అమిత్ నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఆర్కే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాకు దర్శకుడిగా వెంకట్, నిర్మాతగా రాజ్‌కుమార్, ప్రొడక్షన్ మేనేజర్లుగా లీలా ప్రసాద్, రాము వ్యవహరిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు ఇన్‌చార్జిల నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జోనల్ (విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి) ఇన్‌చార్జిలను నియమించారు. యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి నందీష్, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా పీలా వెంకటలక్ష్మిని నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి


ప్రమాదంలో మృతి చెందిన మృతుడు

యలమంచిలి: పెదపల్లి జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. యలమంచిలి రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన కర్రి నాగరాజు (62) పెదపల్లి జాతీయ రహదారి పక్కన నడిచి వెళ్తుండగా తుని నుంచి అనకాపల్లి వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన నాగరాజును కుటుంబ సభ్యులు యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

రావికమతంలో ఆక్రమణల తొలగింపు

ఎవరొచ్చినా ఆపొద్దని సూచనలిచ్చిన విప్ ధర్మశ్రీ


పారదర్శకంగా పూర్తిగా తొలగించాలని సూచనలిస్తున్న విప్ ధర్మశ్రీ


కాలువలపై ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

రావికమతం: స్థానిక బీఎన్ రోడ్డుకు ఇరువైపులా కాలువలపై ఆక్రమణల తొలగింపు చర్యలను ఎట్టకేలకు అధికారులు చేపట్టారు. స్థానిక బస్సు స్టేషన్ నుంచి పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో మంగళవారం మొదలు పెట్టారు. ప్రధాన కాలువలపై నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించడం, ఆ వెనువెంటనే ట్రాక్టర్లతో మట్టి, సిమెంటు వ్యర్థాలను తరలించడం చేపట్టారు. ఇక్కడ ప్రధాన డ్రైనేజీలపై దుకాణాలను ఏర్పాటు చేసి శాశ్వత కట్టడాలు చేపట్టడంతో మురుగునీరంతా రోడ్డుపై చేరుతోంది. ఈ పరిస్థితి దారుణంగా ఉండటంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇటీవల పరిశీలించారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించడంతో నాలుగు రోజులుగా ఆక్రమణదారులను హెచ్చరిస్తూ పంచాయతీ సిబ్బంది ఆటో ద్వారా విస్తృత ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో ఆక్రమణల తొలగింపును పరిశీలించిన విప్ ధర్మశ్రీ వద్ద కొంత మంది కోర్టు నోటీసులంటూ బెదిరిస్తున్నారని సిబ్బంది ప్రస్తావించారు. దానికి స్పందించి కాలువలపై ఆక్రమణలు తొలగించవద్దని ఏ కోర్టూ నోటీసులివ్వదని, అటువంటి సమస్య వస్తే తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆక్రమణల తొలగింపు ఆపొద్దని సూచించారు.

పోలీసులను చూసి.. కారు వదిలేసి పరారీ

113.9 కిలోల గంజాయితోపాటు కారు స్వాధీనం


పోలీసులు పట్టుకున్న గంజాయి కారు

బుచ్చెయ్యపేట: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న కారును బుచ్చెయ్యపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం బుచ్చెయ్యపేట చెరకు కాటా వద్ద ఎస్ఐ కుమారస్వామి తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో వడ్డాది నుంచి రాజాం వైపు వెళ్తున్న కారు డ్రైవర్ పోలీసులను చూసి పొలాల్లోకి వెళ్తుండగా వెంబడించారు. కొంత దూరం వెళ్లిన తర్వాత కారులో వ్యక్తులు దాన్ని అక్కడే విడిచిపెట్టి పారిపోయారు. కారుకు కేరళలో రిజిస్ట్రేషన్ అయినట్టుగా గుర్తించారు. కారులో 113.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

బోధనోపకరణాలతో ఆత్మస్థైర్యం పెంపు

డీఈవో వెంకటలక్ష్మమ్మ


బోధనోపకరణాల కిట్‌ను అందచేస్తున్న ఏఎంసీ చైర్మన్ ఏడువాక

చోడవరం రూరల్: పిల్లలకు తల్లే మొదటి గురువని, తామందచేసే బోధనోపకరణాల ద్వారా బోధించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మానసిక దివ్యాంగులకు బోధనోపకరణ సామగ్రిని పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లోని జాతీయ మేధోపర వైకల్య సాధికారత సంస్థ, సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతోపాటు చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఎంతో విలువైన బోధనోపకరణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా బుద్ధిమాంద్యం పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి వీలుందన్నారు. జాతీయ మేధోపర వైకల్య సాధికార సంస్థ ప్రతినిధి కె.సుజిత్ మాట్లాడుతూ పిల్లల వయసుల వారీగా నాలుగు రకాల కిట్లు అందచేస్తున్నట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లాకు 309 కిట్లు మంజూరు చేశామన్నారు. ఒక్కొక్క కిట్ విలువ రూ.10 వేలు అన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు ఆయా మండలాల వారీగా వీటిని పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల మాట్లాడుతూ ప్రతీ మూడేళ్లకు ఇలాంటి కిట్లు అందచేస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం అమ్మాజీ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కుమారి, వైస్ ఎంపీపీ గంగరాజు, సీఆర్పీ కె.మహాలక్ష్మినాయుడు, నెల్లూరు సీఆర్పీ శ్రీకాంత్, ప్రత్యేక ఉపాధ్యాయుడు బి.ఎ.రాజు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వేమాంబిక మహోత్సవం

తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తజనం


ప్రత్యేక అలంకరణలో వేమాంబిక అమ్మవారు


ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు

యలమంచిలి: ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పెదపల్లి వేమాంబిక అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం కనుల పండువగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. నెల రోజులపాటు జరిగే అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆఖరి రోజున మంగళవారం అత్యంత వైభవంగా పండగ నిర్వహించారు. యలమంచిలి మున్సిపాలిటీలోని పెదపల్లిలో మూడేళ్లకోసారి నిర్వహించే ఉత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వందల సంఖ్యలో భక్తులు ఘటాలను పెదపల్లి, మంత్రిపాలెం, పెదగొల్లలపాలెంలో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అమ్మవారికి చీర, గాజులు పెట్టి పత్రిఫల పుష్పాలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. పెదపల్లి గ్రామ పురవీధుల్లో భారీ సెట్టింగ్‌లు, అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలు, బంతి పూలతో ముస్తాబు చేశారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ మందుగుండు సామగ్రి సెట్టింగ్‌లతో బాణసంచా కాల్చారు.

అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు..

యలమంచిలి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన పార్టీ యలమంచిలి నియోజవర్గ నాయకుడు సుందరపు విజయ కుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు వేమాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ గఫూర్, యలమంచిలి పట్టణ ఎస్సై పాపినాయుడు, రూరల్ ఎస్సై సన్నిబాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు బొద్దపు యర్రయ్యదొర, దాసరి కుమార్, కొడిగుడ్డు రమణ, దుంగా అచ్యుతరావు పాల్గొన్నారు.

29 నుంచి పాలిసెట్ అడ్మిషన్లు

తుమ్మపాల: రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 29 నుంచి ఏపీ పాలిసెట్–23 అడ్మిషన్లు జరగనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి జూన్ 1వ తేదీలోగా కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాలని కోరారు. బీసీ, ఓసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, కులం, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని ఆయన కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 63,159 మంది విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి జూన్ 1 వరకు పరీక్షలు జరుగనున్నాయి. మొదటి, రెండో సంవత్సరం కలిపి విశాఖ జిల్లాలో 40,986 మంది, అనకాపల్లిలో 16,807 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 5,366 మంది విద్యారులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 63,159 మంది పరీక్షలు రాయనున్నారు. విశాఖ జిల్లాలో 62, అనకాపల్లిలో 25, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అడ్వాన్స్‌డ్ పరీక్షలకు కూడా జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌తో పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

సప్లిమెంటరీ పరీక్షలకు సైతం ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థుల సౌకర్యార్థం బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. హాల్ టికెట్‌తో విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరు ఫ్లయింగ్, ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. అన్ని కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు.

జూన్ 5 నుంచి ప్రాక్టికల్స్

మొదటి సంవత్సరం మానవీయ విలువలు పరీక్ష జూన్ 2న ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు విద్యార్థులు చదువుకున్న కాలేజీల్లోనే రాయాల్సి ఉంటుంది. పర్యావరణ విద్య జూన్ 3న ఉంటుంది. ప్రయోగ పరీక్షలు జూన్ 5 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కాలేజీ ప్రిన్సిపాళ్లకు సమాచారం ఇవ్వనున్నట్లు ఆర్ఐవో ఉమారాణి తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె చెప్పారు.

క్లుప్తంగా

మూడు రోజుల పాటు గడప గడపకు

కశింకోట : మండలంలో బుధవారం నుంచి వరుసగా మూడు రోజులపాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మొదటి రోజు చెరకాం గ్రామం, 25, 26 తేదీల్లో వెదురుపర్తి గ్రామాల్లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ప్రతులను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తారన్నారు.

చింతామణి దత్తక్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


కార్యసిద్ధి ఆంజనేయస్వామి

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక క్షీరాభిషేకం జరిగింది. అంతకుముందు ఉదయం 7 గంటలకు కార్యసిద్ధి ఆంజనేయస్వామికి బడబానల స్తోత్రంతో పాటు హనుమన్మాలా మంత్రంతో నాగవల్లీ దళ అర్చన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నట్టు క్షేత్రం నిర్వాహకులు మూర్తి చెప్పారు.

25న విజయవాడలో ఏపీ రాష్ట్ర బీసీ సంఘాల సమావేశం

అనకాపల్లిటౌన్ : విజయవాడ అయిలాపురం హోటల్లో ఈనెల 25న ఏపీ రాష్ట్ర బీసీ సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘ రాష్ట్ర ఉత్తరాంధ్ర కన్వీనర్ ఆడారి కుమారస్వామి తెలిపారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో 50 బీసీ సంఘాలు ఒకే వేదికపై సమావేశం కానున్నాయని తెలిపారు. బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ఆదిశేషు అధ్యక్షతన సమావేశం జరగనుందని పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాధికారం, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ వంటి అంశాలపై సమావేశంలో విస్తృత స్థాయిలో చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల అధ్యక్షులు హాజరుకావాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 317 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,530	5,060
రెండో రకం	4,050	4,300
మూడోరకం	3,570	4,030

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
రామబాణం	: సత్యనారాయణ-1
అన్నీ మంచి శకునములే	: సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డీసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10	: వెంకటేశ్వర
ఉగ్రం	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 69 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-45 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 328 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 291 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పాఠశాలల ఆస్తులకు భద్రత

- 16 పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ నియామకం
- దొంగతనాలు, ఆకతాయిల చేష్టలకు చెక్



పట్టణంలో బాలికల హైస్కూల్

తుమ్మపాల : గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నిర్వీర్యమైపోయిన ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూపురేఖలు మార్చింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సుందరంగా తీర్చిదిద్దారు. ఒక్కో పాఠశాలను లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేశారు. వీటి భద్రతకు నూతనంగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రతి హైస్కూల్లోనూ నైట్ వాచ్‌మెన్ నియామకంపై మండల విద్యాశాఖ అధికారులకు ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనకాపల్లి మండలం, పట్టణంలో ఉన్న ఎనిమిది పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌లను విద్యాశాఖ మండల అధికారి నియమించారు.

అసాంఘిక కార్యకలాపాలకు చెక్

విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలలు సైతం అనేక సందర్భాల్లో దొంగతనాలు, దోపిడీకి గురైన రోజులు ఉన్నాయి. పాఠశాలల్లో ఉండే కంప్యూటర్లు, టీవీలు, కిటికీలు, బెంచీలు వంటివి చోరీ జరిగిన ఘటనలు చాలానే ఉన్నాయి. మండలంలో కూండ్రం, కుంచంగి, మార్టూరు, సీహెచ్.ఎస్.అగ్రహారం, కోడూరు, కొండకొప్పాక జిల్లా పరిషత్ పాఠశాలలు గడిచిన 10 ఏళ్లలో దొంగతనాల బారిన పడ్డాయి. అలాగే ఇప్పటికీ అనేక పాఠశాలల్లో ఆకతాయిలు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ పాఠశాల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలకు నైట్ వాచ్‌మన్ల నియామకం జరిగింది. పాఠశాలల ఆస్తులకు భద్రత ఏర్పడింది.

స్థానికులకే అవకాశం

జిల్లా పరిషత్ పాఠశాలకు నైట్ వాచ్‌మెన్‌లను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ముఖ్యంగా పాఠశాలల హెచ్‌ఎంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుడైన వ్యక్తిని వాచ్ మెన్‌గా నియమించి నెలకు రూ.6వేలు గౌరవ వేతనం అందిస్తున్నారు. ఆ పాఠశాలల్లో పనిచేసే మిడ్డే మీల్, శానిటరీ పనులు చేసే (మహిళ) భర్తకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 60 ఏళ్ల వయస్సులోపు ఎక్స్‌సర్వీస్ మెన్ గాని, తల్లిదండ్రుల కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని గాని నియమించాలని ప్రభుత్వం ఆదేశాల జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం ఎంఈవో, హెచ్‌ఎం సమన్వయంతో నమ్మకంతో పనిచేసే వ్యక్తులను నియమించారు.

16 హైస్కూళ్లకు వాచ్‌మన్లు

అనకాపల్లి మండలం, పట్టణంలో మొత్తం ఎనిమిది ప్రభుత్వ హైస్కూల్స్ ఉన్నాయి. పట్టణంలో జీవీఎంసీ పరిధిలో ఎంజీ హైస్కూల్, గవరపాలెం, ఎంజీ హైస్కూల్(మెయిన్), పట్టణంలో మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌తో పాటు గాంధీనగరం, భీమునిగుమ్మం హైస్కూల్, జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాక జిల్లా పరిషత్ హైస్కూల్, మండలంలో తారకరామా కాలనీ, కోడూరు, సీహెచ్ఎస్అగ్రహారం, మార్టూరు, మామిడిపాలెం, దిబ్బపాలెం, తుమ్మపాల, కుంచంగి, కూండ్రం, సీతానగరం జిల్లా పరిషత్ పాఠశాలల్లో వాచ్‌మెన్‌లను నియమించారు.

అన్ని హైస్కూళ్లకు రక్షణ



నాడు-నేడు, డిజిటల్ తరగతుల ఏర్పాటులో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలల్లో అనేక రకాల పరికరాలను ప్రభుత్వం అందించింది. వాటి భద్రత బాధ్యత హెచ్‌ఎంలపై ఉంటుంది. రాత్రి వేళ ఆయా పరికరాలు చోరీకి గురి కాకుండా చూడడంతో పాటు పాఠశాల ఆవరణలోకి ఎవరూ ప్రవేశించకుండా రక్షణ కల్పించేలా ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌ల నియామకానికి అవకాశం కల్పించడం మంచి పరిణామం. అన్ని హైస్కూళ్లకు వాచ్‌మెన్‌లను నియమించాం.

– డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి మండలం

అభినందనీయం

జిల్లా పరిషత్ పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం. గతంలో రాత్రి సమయాల్లో దొంగతనాలపై చాలాసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం మంచి ఆలోచనతో వీరిని నియమించింది. పాఠశాల ఆస్తులకు రక్షణగా వాచ్‌మెన్‌లు ఉంటున్నారు.

– రెడ్డి ఆదినారాయణ, హెచ్‌ఎం, ఎంజీ హైస్కూల్, గవరపాలెం

బడుగు, బలహీన వర్గాల పార్టీ వైఎస్సార్‌సీపీ


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనకాపల్లిటౌన్ : స్వాతంత్ర్యం వచ్చి75 సంవత్సరాలు తరువాత రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని 80వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరిబిల్లి పరి అన్నారు. పార్టీ అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయి, 5వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్థానిక విజయా రెసిడెన్సీలో జరిగిన కార్యక్రమంలో మంగళవారం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల సమయంలో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో రాష్ట్రంలో ఆదాయం లేకపోయినప్పటికీ బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకూడదని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. నాలుగేళ్ల పాలనలో ఎటువంటి అవినీతికి లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అర్హులైన లబ్ధిదారులకు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఆడారి శ్రీనివాసరావు, శ్రీధరాల మనోజ్‌కుమార్, పిళ్లా నరసింహారాజు, మళ్ల వంశీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయోత్సవాలు

ఏపీ అసెంబ్లీ ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి నాలుగేళ్లు అయిన సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు కార్యాలయంలో మంగళవారం రాత్రి పార్టీ శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జానకీరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌లు కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, కడిమిశెట్టి సతీష్, పెద్దాడ రాంశంకర్, రాయవరపు జోగిరాజు, కోన ఉమ, దొంక సత్తిబాబు, మేడిశెట్టి గణేష్, కొండూరు రవీంద్ర, బంగారు చంటి, ఈతలపాక శివ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం


జార్జిక్లబ్ ఆవరణలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లిటౌన్ : క్రీడలు పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. వేసవి క్రీడల్లో భాగంగా స్థానిక జార్జిక్లబ్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలను, జీవీఎంసీ గాంధీనగరం హైస్కూల్లో టెన్నికాయిట్ శిక్షణ శిబిరాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి వల్ల ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. ప్రతి ఏడాది వేసవిని పురస్కరించుకుని ప్రభుత్వం పిల్లలకు ఉచితంగా వేసవి శిక్షణాశిబిరాలను నిర్వహిస్తూ, పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, జెడ్పీ వెంకటరమణ, జార్జిక్లబ్ అధ్యక్షుడు బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, గాంధీనగరం హైస్కూల్ హెచ్‌ఎం విశ్వేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్వీ నర్సింహం, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి దుకాణం దగ్ధం

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి టిఫిన్ దుకాణం దగ్ధమైంది. సుమారు రూ.50 వేల నష్టం జరిగింది. దివ్యాంగుడైన ఉప్పల శ్రీనివాసరావుకు చెందిన దుకాణంలో అకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్ పేలి పైకప్పుగా ఉన్న రేకులు ఎగిరిపోయాయి. దుకాణంలో ఉన్న కుర్చీలు, బల్లలు కాలిపోయాయి. అదృష్టవశాత్తు ఎవరికీ హాని జరగలేదు. ప్రమాదం వల్ల మంటలను స్థానికులు అదుపు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధితుడు శ్రీనివాసరావు కుటుంబానికి నెల రోజులకు సరిపడిన నిత్యావసర సరుకులను అందజేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్ బాధితులను పరామర్శించారు. ప్రమాదంపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై హర్షం


రేబాకలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

అనకాపల్లిటౌన్ : మండలంలో రేబాక గ్రామంలో ఇటీవల దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కొంతకాలంగా పాత ట్రాన్స్‌ఫార్మర్‌తో చాలా ఇబ్బందులు పడ్డామని గ్రామస్తులు తెలిపారు. అధికారులు సమస్య పరిష్కరించడంతో లో వోల్టేజీ, విద్యుత్‌కు అంతరాయం వంటి ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు, రేపు ఆధార్ శిబిరాలు

కశింకోట: కశింకోట పంచాయతీ కార్యాలయంలో ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నామని కార్యదర్శి ఎస్.రమేష్ తెలిపారు. బుధ, గురువారాల్లో జరిగే శిబిరంలో ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు ఉంటే చేయించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

అనకాపల్లిటౌన్ : జంగిల్‌క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని డివిజన్ విద్యుత్‌శాఖ ఆపరేటింగ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగి సుబ్బరాజుగారి వీధి, గౌరీ సంఘం వీధి, సతకంపట్టు ఏరియా, గవరపాలెం ఉమెన్స్ కళాశాల ప్రాంతం, దిబ్బవీధి, రైతు సంఘం ఏరియా, దాడి భోగలింగంవీధి, గంగిరేవిచెట్టు ప్రాంతం, అరుంధతీనగర్ ప్రాంతాల ప్రజలు ఈ అసౌకర్యానికి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ


పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని అరబుపాలెంలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో నేల వేషాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

ప్రకృతి సేద్యం పెంపుదలే లక్ష్యం


సిబ్బందికి శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి

మాకవరపాలెం: ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య పెరగడమే లక్ష్యంగా పనిచేయాలని ఏవో చిరంజీవి సంబంధిత సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నర్సీపట్నం డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ప్రకృతి సేద్య సిబ్బందితో ఏవో సమీక్షించారు. ఈ సందర్భంగా వచ్చే ఖరీఫ్ లక్ష్యాలపై చర్చించారు. రైతులు ప్రకృతి సేద్యంపై ఆసక్తి చూపాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించొచ్చని పేర్కొన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు వరలక్ష్మి, రామలక్ష్మి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నవధాన్యాల సాగు-నేలతల్లి బాగు కార్యక్రమంలో 30 రకాలకు సంబంధించిన 12 కేజీల విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. వీటిని తొలకరి ప్రారంభంలో వరి పండించే పొలాల్లో చల్లుకోవాలన్నారు. అనంతరం వచ్చిన మొక్కలను దుక్కుల్లో కలియదున్నుకోవడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. వెలుగు ఏపీఎం చినబాబు, మాస్టర్ ట్రైనర్లు సుదర్శన్, సత్యనారాయణ, ఆరు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు


రైతులకు చెక్కులను అందిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు

పాయకరావుపేట : రైతులు సహకార సంఘాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండలంలో గల శ్రీరాంపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో గల రైతులకు పట్టణంలో గల డీసీసీబీ బ్రాంచిలో మంగళవారం రుణాల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ సహకార సంఘాల్లో రైతులకు పంట రుణాలు, వ్యవసాయేతర రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ పెట్టుబడులకు, ఇతర అవసరాలకు రైతులు సహకార సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చునన్నారు. అనంతరం పలువురు రైతులకు రూ.40 లక్షలు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ లీల, ఫీల్డ్ ఆఫీసర్ జోగినాయుడు, సీఈవో టి.వి.రామరాజు, జి.ఎస్.వెంకటరావు, కొంతం రాము పాల్గొన్నారు.

అధిక వేగం...లేదు కళ్లెం!

- అధికలోడు, మితిమీరిన వేగంతో భారీ వాహనాల రాకపోకలు
- పూడిమడక రోడ్డులో ప్రయాణికుల బెంబేలు
- ప్రమాదాలు జరిగే అవకాశం


పూడిమడక రోడ్డులో దూసుకొస్తున్న లారీ


పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

మునగపాక : మితిమీరిన వేగం.పరిమితికి మించిన లోడుతో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో పూడిమడక రోడ్డుపై ప్రయాణం అంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి బైపాస్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారిలో చోడపల్లి, కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట, మునగపాక, నాగులాపల్లి తదితర గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అనకాపల్లి బైపాస్ రోడ్డు నుంచి అచ్యుతాపురం వరకు వెళ్లే రహదారిపై పరిమితికి మించి లోడుతో భారీ వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. ఈ రోడ్డుపై 15 టన్నులకు మించి వాహనాలు వెళ్లడానికి వీలు లేదు. అయినా తమకు పట్టనట్టు భారీ వాహనదారులు 60 నుంచి 80 టన్నులతో ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు శిథిలావస్థకు గురవుతుంది. భారీ వాహనాల రాకపోకల కారణంగా ఒకవైపు రహదారి దెబ్బతినడమే కాకుండా మరోవైపు అధిక వేగం కారణంగా ప్రమాదాలపై భయం నెలకొంటున్నది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలపై రాకపోకలు సాగించేవారు ఆందోళనకు గురవుతున్నారు. భయం గుప్పిట్లో రాకపోకలు సాగిస్తున్నారు.

నియంత్రణ తూతూ మంత్రం...

ఒకవైపు పూడిమడక రోడ్డులో ప్రయాణం సాగించే క్రమంలో పలువురు గాయాల బారిన పడడం, అలాగే కొంతమంది మృత్యువాతకు గురైన సందర్భాలు లేకపోలేదు. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన పూడిమడక రోడ్డుపై భారీ వాహనాలను నియంత్రించాల్సిన అధికారులు కూడా తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మార్గంలో అధికలోడుతో వాహనాలు రాకూడదన్న నిబంధనలున్నా అమలు కావడం లేదు.పలు ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ప్రయివేటు ఐటీఐలలో చదువుకునేందుకు నిత్యం విద్యార్థులు ఈ రోడ్డుమార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలను తప్పించుకుంటూ వారంతా భయంతో రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

భారీ వాహనాలను నియంత్రించాలి



పూడిమడక రోడ్డులో ప్రయాణం అంటేనే భయంగా ఉంటుంది. భారీ వాహనాలు అధిక లోడుకు తోడు మితిమీరిన వేగంతో ఈ రోడ్డుపై దూసుకు వస్తున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకొని వాహనాల వేగాన్ని నియంత్రించాలి.

– రాజాన బుజ్జిబాబు, ద్విచక్ర వాహనదారు, మునగపాక

చర్యలు తీసుకుంటాం



పూడిమడక రోడ్డులో అధికలోడుతో వాహనాలు వెళితే చర్యలు తప్పవు. ఇప్పటికే లారీ యజమానులకు హెచ్చరికలు జారీ చేశాం. అతి వేగంతో వాహనాలు నడిపినా లేదా అధికలోడుతో వాహనాలు వచ్చినా ఉపేక్షించేది లేదు. భారీ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– మహమ్మద్ ఆలీ షరీఫ్, ఎస్ఐ

పాత కక్షలతో దాడి కేసులో నిందితుడికి జైలు

కశింకోట : మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో పాత కక్షలతో పొరుగింటి వారితో గొడవపడి రాయితో కొట్టి కంటి చూపుపోవడానికి కారణమయ్యారనే అభియోగం రుజువు కావడంతో కొసిరెడ్డి వెంకటరమణ (50)కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ అనకాపల్లి 2వ ఏజేసీజె మరియు 12వ ఏఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఏఎస్ పేటకు చెందిన వెంకటరమణ 2019 మే 2019న పొరుగింటి వారితో పాతకక్షలు దృష్టిలో పెట్టుకొని గొడవ పడ్డాడు. ఈ సమయంలో రాయితో కొట్టగా మందపల్లి తేజ సాయికుమార్ ఎడమ కంటికి బలమైన గాయమై కంటి చూపు పోయింది. ఈ విషయమై తండ్రి వెంకటేశ్వరరావు అప్పట్లో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కోర్టులో వాదనలు ముగిసిన తర్వాత నేరం నిరూపణ కావడంతో వెంకట రమణకు శిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించామన్నారు.

29న కలెక్టరేట్ వద్ద ఉపాధి హామీ కూలీల ధర్నా

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 29న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద సీఐటీయూ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలపై కలెక్టరేట్‌ల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, హరిపాలెం, పెదపాడు గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో సమావేశమై ఆయన ఛలో కలెక్టరేట్ కార్యక్రమం గురించి వివరించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు


అధికారుల దాడుల్లో పట్టుబడిన నాటుబళ్లు

ఎస్.రాయవరం : వరాహనదిలో అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్యామ్‌కుమార్ హెచ్చరించారు. తరచూ నదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది కలిసికట్టుగా మంగళవారం దాడులు నిర్వహించి ఇసుక రవాణా చేస్తున్న 9 నాటుబళ్లను పట్టుకున్నట్టు చెప్పారు. ఈ సిబ్బంది తరచూ గ్రామాల్లో ఇసుక తీస్తున్నట్టు సమాచారం ఉందని, ఇసుక రవాణాతో నదీ గర్భం గోతులు పడుతోందన్నారు. ఇకపై అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన నాటుబళ్లను తిమ్మాపురం సచివాలయం ప్రాంగణంలో భద్రపరచామన్నారు.

55 మందికి ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు గణపతిరావు

పాయకరావుపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డా.వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట లింగాల కాలనీలో కంటి శిబిరం జరిగింది. వైద్యాధికారిణి డా.పద్మప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఆఫ్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు సుమారు 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 8 మందికి శస్త్ర చికిత్సలు, 45 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని వచ్చే నెల 13వ తేదీన విశాఖపట్నం ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు తరలిస్తామని వైద్యాధికారి తెలియజేశారు. ఆరోగ్య విస్తరణాధికారి గణేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు సేవలందించారు.